# 6. చలానాల ద్వారా రుసుముల చెల్లింపులు



ఆంగ్లమూలం:
**శ్రీ బి. సూర్యనారాయణ**
DIG (R&S), Ongole

తెలుగు అనువాదం: **శ్రీ బి. విజయప్రసాద్,** సబ్ రిజిస్ట్రార్, కనిగిరి

**1. బ్యాంకుల ద్వారా, స్టాంపు సుంకం, రిజిస్ట్రేషన్ రుసుము, మరియు యూజర్ రుసుములు చెల్లించటం అంటే ఏమిటి ?**

రిజిస్ట్రేషన్ నిమిత్తం, సబ్ రిజిస్ట్రారు కార్యాలయములకు వచ్చే కక్షిదారులు, ప్రభుత్వమునకు చెల్లించవలసిన రుసుములను అనగా స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము, యూజర్ ఛార్జీలను ఆ సబ్ రిజిస్ట్రారు కార్యాలయమునకు అనుసంధానించిన అధీకృత బ్యాంకు నందు చలానా రూపములో చెల్లించవలెను. బ్యాంకు వారు సదరు మొత్తము కట్టించుకొని పార్టీ చలానా కాపీ మరియు రశీదును జారీ చేస్తారు. ఆ చలానా రశీదులను సంబంధిత సబ్ రిజిస్ట్రారు కార్యాలయములో మాత్రమే స్వీకరించుట జరుగును.

**2. పై విధానము జాగ్రత్తతో కూడుకున్నదేనా ?**

ఖచ్చితంగా జాగ్రతతో కూడుకున్నదే. కనుకనే ఇది ప్రభుత్వ ఉత్తర్వులు G.O.Ms. No.953 Rev.(Reg-I), తేది.10.09.2003 మరియు G.O.Ms. No.958 Rev.(Reg-I), తేది.13.9.2003 ప్రకారం ఆమోదించబడింది.

**3. ప్రభుత్వమునకు రిజిస్ట్రేషన్ పరంగా చెల్లించవలసిన రుసుములను ఏ ఏ పద్ధతులలో చెల్లించవచ్చు?**

1) చెల్లించవలసిన రుసుములు రూ.1000/-మించినప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమునకు అనుసంధానించిన అధీకృత బ్యాంకు నందు చలానా ద్వారా చెల్లించుట.

2) చెల్లించవలసిన రుసుములు రూ.1000/-లోపు అయితే నేరుగా సబ్ రిజిస్ట్రారు కార్యాలయములో నగదు రూపంలో చెల్లించవచ్చు లేదా బ్యాంకులో చలానా ద్వారా కూడా చెల్లించవచ్చును.

3) డిమాండ్ డ్రాఫ్ట్ / షెడ్యూలు బ్యాంకులు జారీచేసే బ్యాంకర్ చెక్స్‌ను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ వారి పేర తీసుకొని దస్తావేజు దాఖలు చేయవచ్చు.

4) అన్ని రుసుములకు సంబంధించి ఒకే డిమాండ్ డ్రాఫ్ట్ / బ్యాంకర్స్ చెక్ దాఖలు చేయవచ్చు. షెడ్యూలు బ్యాంకుల జాబితా ఈ చాప్టర్‌కు జతచేయబడినది.

4. **పార్టీలు చలానాలను ఎలాపూర్తి చెయ్యాలి?**

ప్రభుత్వము వారు సరియైన హెడ్ ఆఫ్ ఎకౌంట్‌లతో కూడిన చలానా ఫారములు (ప్రొఫార్మాలు) విడుదల చేసియున్నారు. పార్టీలు స్వయంగా పూరించుకోవచ్చు, లేదా సమీప సబ్ రిజిస్ట్రారు కార్యాలయమును సంప్రదిస్తే వారు సహాయ పడగలరు.

5. **రెండు మూడు దస్తావేజులకు కలిపి ఒకటే చలానా ద్వారా రుసుములు చెల్లించవచ్చా ?**

కుదరదు. చలానా రూపములో గాని, డిమాండ్ డ్రాఫ్ట్ / బ్యాంకర్ చెక్కు గాని ప్రతి దస్తావేజుకు విడివిడిగా చెల్లించి దాఖలు చేయవలెను.

6. **పార్టీలు దస్తావేజును చలానా, రశీదులతో పాటు దాఖలు చేయగానే సబ్ రిజిస్ట్రారు పాటించవలసిన విధానం ఏంటి ?**

1) దస్తావేజుతో పాటు చలానా, రశీదును సబ్ రిజిస్ట్రారుకు దాఖలు చేయగానే, సబ్ రిజిస్ట్రారు చలానా, రశీదు మీద బ్యాంకు అధికారులు పెట్టిన సంతకములను, నమూనా సంతకములతో సరిపోల్చి పార్టీలకు రశీదు యిచ్చి తదుపరి దస్తావేజును పరిశీలించి అన్నీ సక్రమంగా వుంటే దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించవచ్చును. దాఖలు ఎండార్సుమెంటులోను సర్టిఫికేటు లోనూ రుసుముల చెల్లింపు వివరాలు నమోదు పరచాలి.

2) అలా పార్టీలు దాఖలు చేసిన చలానాలను, రశీదులను మరియు ప్రతిరోజు అధీకృత బ్యాంకు వారు పంపిన యస్.ఆర్.ఓ. కాపీ చలానాలను మరియు ప్రతిరోజు బ్యాంకులు పంపే జాబితా (Scroll) లతో సరిచూసి, వాటిని భవిష్యత్ అవసరము కోసం భద్రపరచవలెను.

3) రిజిస్ట్రేషన్ ప్రకియ పూర్తి అయిన పిమ్మట దస్తావేజుతో పాటు అధీకృత బ్యాంకు వారు జారీ చేసిన రశీదును దస్తావేజులో భాగంగా అనగా ఒక పేజీగా వుంచి స్కాన్ చేసి, ఆ రశీదును శాశ్వత రికార్డుగా భద్రపరచవలెను. అంతేకాని పార్టీలకు తిరిగి ఇవ్వరాదు.

4) పార్టీలు డిమాండ్ డ్రాఫ్టులు వగైరాలను దాఖలు చేసినపుడు, ఆ సొమ్ము రిజిస్ట్రేషన్ శాఖ ఖాతాకు జమ అయ్యే వరకు దస్తావేజును పెండింగ్ వుంచనవసరం లేదు. దస్తావేజు రిజిస్ట్రేషన్ చేసి పార్టీలకు తిరిగి ఇచ్చేయవచ్చు.

5) ప్రతిరోజు అధీకృత బ్యాంకు నుండి, ఆ రోజు రిజిస్ట్రేషన్ నిమిత్తం డబ్బులు జమచేసిన జాబితా (Scroll) ను సబ్ రిజిస్ట్రారు పరిశీలించి, హెడ్ ఆఫ్ ఎకౌంట్ వారీగా ప్రభుత్వ చలానాలు తయారు చేసి, సదరు మొత్తమును ఏ రోజుకారోజు జమచేయవలెను. అలాగే అధీకృత బ్యాంకు లేనిచోట మొత్తం సొమ్ముకు, కమీషన్ లేని డి.డి./బ్యాంకర్స్ చెక్స్‌ను బ్యాంకుల వారు జారీ చేయాలి. అలాగే ప్రభుత్వానికి జమ చేసిన చలానాలను కూడా ఖజానాశాఖతో సమన్వయము (Reconciliation) నిమిత్తం భద్రపరచాలి.

7. **పార్టీలు రిజిస్ట్రేషన్ నిమిత్తం అధీకృత బ్యాంకులో రుసుములు జమ చేసిన తర్వాత బ్యాంకు వారు చేయవలసిన విధులు ఏమిటి ?**

పార్టీలు రిజిస్ట్రేషన్ నిమిత్తం, డబ్బులు జమ చేయగానే, ఏ రోజుకు ఆ రోజు సాయంత్రం, ఆ రోజు జమచేసిన వారి పేర్లు, చలానా నెంబర్లు, హెడ్ ఆఫ్ ఎకౌంట్ వారీగా ఎంతెంత జమచేసింది, ఒక జాబితా (Scroll) ను తయారు చేసి సబ్ రిజిస్ట్రారు కార్యాలయమునకు పంపాలి. అలాగే సదరు మొత్తము ఖజానాశాఖ బ్రాంచికి విధిగా బదిలీ చేయాలి.

8 **శెలవు రోజులు, బంద్‌లు వగైరాల సందర్భముగా బ్యాంకులు పనిచేయని రోజులలో ప్రభుత్వమునకు రుసుములు ఎలా చెల్లించాలి?**

సబ్ రిజిస్ట్రార్లు అలాంటి రోజులలో ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు నేరుగా డబ్బులు కట్టించుకొని రిజిస్ట్రేషన్లు జరుపవచ్చును. అలాగే పార్టీలు సబ్ రిజిస్ట్రారు వారి పేరు మీద డిమాండ్ డ్రాఫ్ట్ / బ్యాంకర్స్ చెక్కులు ఇవ్వడం ద్వారా కూడా రిజిస్ట్రేషన్లు చేసుకొనవచ్చును.

9. **డిమాండ్ డ్రాఫ్టులు / బ్యాంకర్స్ చెక్స్ ద్వారా ప్రభుత్వ రుసుములు చెల్లించిన సందర్భములో సబ్ రిజిస్ట్రారు ఏ విధానములు అవలంబించవలెను?**

నగదు రూపములో గాని, డిమాండ్ డ్రాఫ్టులు/బ్యాంకర్స్ చెక్స్ ద్వారా కాని వసూలైన మొత్తములను సబ్ రిజిస్ట్రార్‌లు అధీకృత బ్యాంకుకు ఆ రోజు గాని/తర్వాత రోజుగాని జమచేయవలెను.

10 **పార్టీలు అధీకృత బ్యాంకులో, రిజిస్ట్రేషన్ నిమిత్తము కట్టిన సొమ్మును ఏదైనా కారణము వలన రిజిస్ట్రేషన్ జరగకపోతే వాపసు పొందవచ్చా?**

పొందవచ్చు. స్టాంపు డ్యూటీకి సంబంధించి, ఒరిజినల్ డాక్యుమెంట్, ఒరిజినల్ చలానాతో పాటు ఒక దరఖాస్తు వ్రాసి సంబంధిత రెవిన్యూశాఖ వారికి 3 నెలలలోపు అర్జీ పెట్టుకోవలెను. అప్పుడు కట్టిన స్టాంపు డ్యూటీలో 10% మినహాయించి మిగిలినది వాపసు చేయబడును. 4వ నెలలో దరఖాస్తు చేసుకుంటే 20% మినహాయించబడును. అలాగే రిజిస్ట్రేషన్ రుసుములు, యూజర్ ఛార్జీలు వాపసుకొరకు ఒక దరఖాస్తును సంబంధిత జిల్లా రిజిస్ట్రారు వారికి, సంబంధిత సబ్ రిజిస్ట్రారు వారి ద్వారా పంపుకోవాలి. 4 నెలల తర్వాత వాపస్ పొందుటకు అవకాశం లేదు. పార్టీలు ఒక వేళ కట్టవలసిన దానికన్నా ఎక్కువ మొత్తం పొరబాటున కట్టినట్లయితే అట్టి చలానాను ఉపయోగించుకొన్న తర్వాత, మిగిలిన మొత్తమును ప్రభుత్వము వారి వద్ద నుండి వాపసు ఉత్తర్వులు పొందవలెను.

11 **పార్టీలు ఉపయోగించని చలానా యొక్క స్టాంపు డ్యూటీ వాపసు పొందే విధానం ఏమిటి ?**

పార్టీలు చెల్లించిన మొత్తానికి అధీకృత బ్యాంకు వారు జారీ చేసిన ఒరిజినల్ చలానా, మరియు రశీదును దరఖాస్తుతో పాటుగా, సంబంధిత సబ్ రిజిస్ట్రారుకు సమర్పించగానే వాటిని రికార్డుల పరంగా పరిశీలించి, సదరు చలానాను అప్పటి వరకు రిజిస్ట్రేషన్ నిమిత్తం ఉప యోగించలేదని

ధృవీకరణ చేస్తూ సంబంధిత తహశీలుదారువారికి పంపవలెను. పార్టీలు తదుపరి రెవిన్యూశాఖ వారిని మిగిలిన విషయముల కొరకు సంప్రదించవలెను.

**12 పార్టీలు ఉపయోగించని చలానాలలోని రిజిస్ట్రేషన్ రుసుములు / యూజర్ ఛార్జీలు వాపసు పొందే విధానం ఏమిటి ?**

పార్టీలు రిజిస్ట్రేషన్ జరగని సందర్భాలలో, ఉపయోగించని చలానాలోని రిజిస్ట్రేషన్ రుసుము, యూజర్ ఛార్జీలు పొందటానికి, దరఖాస్తు ఫారముతో పాటు, చలానా కాపీ మరియు రశీదు కాపీని సబ్ రిజిస్ట్రారు వారికి దాఖలు చేయాలి. అలా చేసిన దరఖాస్తును సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయ రికార్డులలో సరిపోల్చి అప్పటి వరకు ఆ చలానా ఆధారముగా రిజిస్ట్రేషన్ జరగలేదని ధృవీకరించి జిల్లా రిజిస్ట్రారు వారికి వాపసు కొరకు పంపాలి.

**13 పార్టీలు, బ్యాంకు వారు జారీ చేసిన ఒరిజినల్ చలానాను పోగొట్టుకొన్న సందర్భములో ఎలాంటి పద్ధతి అవలంబించాలి?**

1) సదరు చలానా యొక్క డూప్లికేటు ప్రతిని, మరియు దాంతోపాటుగా ఒరిజినల్ రశీదును బ్యాంకువారు ధృవీకరించి పంపినచో అట్టి వాటిని రిజిస్ట్రేషన్ కొరకు ఆమోదించవచ్చును.

2) పార్టీలు సదరు మొత్తమునకు నష్ట పూరిత హామీ పత్రము (Indemnity Bond) ను వ్రాసి జతపరచవలెను.

3) సబ్ రిజిస్ట్రారు వారు, సదరు చలానా పోయిన విషయము సంబంధిత రెవిన్యూ వారికి అలాంటి చలానా ఏదైనా వాళ్ళ దృష్టికి వాపసు నిమిత్తం వచ్చినపుడు జాగ్రత్తగావుండటం కోసం తెలియపరుస్తూ, సమాచారము ముట్టినట్లు వారి వద్ద నుండి రశీదు పొందవలెను.

**14 పార్టీలు ఒకసారి కట్టిన చలానాను ఉపయోగించక అలానే వుంచి తర్వాత భవిష్యత్తులో ఆ చలానాను ఉపయోగించుకోవచ్చునా ?**

వాడుకోవచ్చు. 1) అట్టి చలానాను దస్తావేజుతో దాఖలు చేసినపుడు పార్టీలు సంబంధిత సబ్ రిజిస్ట్రారుకు ఒక దరఖాస్తు వ్రాసి ఎందువలన సదరు చలానాను ఇంతవరకు వాడుకోలేదో కారణములను తెలుపుతూ ఒక వాంగ్మూలము (depositon) వ్రాసి దాఖలు చేసుకోవాలి.

2) అలాంటి చలానా కట్టిన తేది దగ్గర నుండి 4 నెలలు కాలము గతించిన (elapse) తర్వాత మరియు ఒక సంవత్సరము లోపల అయితే సబ్ రిజిస్ట్రారు వారు అనుమతించవచ్చును.

3) సదరుచలానా కట్టిన తేది దగ్గర నుండి ఒక సంవత్సరము దాటిన తర్వాత సంబంధిత సబ్ రిజిస్ట్రారు పార్టీలు దాఖలు చేసిన దరఖాస్తు ఫారం మరియు వాంగ్మూలముతో సహా సంబంధిత జిల్లా రిజిస్ట్రారు వారికి, సదరు చలానా ఉపయోగించు నిమిత్తము ఉత్తర్వులు పొందవలసివుంటుంది.

## ANNEXURE
## LIST OF SCHEDUE BANKS